# పకడ్బందీగా భూ రీ సర్వే చేపట్టాలి

- కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ఖమ్మం : భూ రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా, కచ్చితత్వంతో నిర్వహించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కూసుమంచి మండలం భగత్‌వీడు రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా సర్వే బృందాలకు, రైతులకు

మిగతా 2లో..

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 23 | ఆగస్టు | 2026
పేజీలు : 8

# సన్నగిల్లుతున్న ఆశలు..!



## -చేసిన వారిలో అసంతృప్తి.. రాని వారిలో నిరాశ
## -నామినెటెడ్ పదవులపై భిన్న స్వరాలు



ప్రజాపక్షం/ఖమ్మం : అధికార కాంగ్రెస్ పార్టీపై ప్రజలతో పాటు ఆ పార్టీలో పదవులను ఆశిస్తున్న వారిలో ఆశలు సన్నగిల్లుతున్నాయి. దశాబ్ద కాలం పాటు మాకు ఎదురు లేదని చెబుతున్న కాంగ్రెస్ నేతలు ఒకవైపు అయితే బాంబుల లాంటి మాటలతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలను బహిర్గతం చేస్తున్న వారు మరో వైపు ఉన్నారు. గడిచిన 10 రోజులుగా వరుసగా నేతలు నోరు జారుతున్న వైనం అధికార పార్టీని ఇబ్బందులుపెడుతుంది. రాజగోపాల్‌రెడ్డితో మొదలై చెన్నారెడ్డి, కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్, మంత్రులు వివేక్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరుల మాటలు ఇప్పుడు ఇబ్బందికరంగా మారాయి. రాజగోపాల్ రెడ్డి ఏకంగా కాంగ్రెస్సేతరులు పెత్తనం చేస్తున్నారంటే సుస్మిత పటేల్ ముఖ్యమంత్రి చిట్టా బయట పెడతానంటూ హెచ్చరించింది. వివేక్ నేను గెలవను మా పార్టీ కూడా గెలవదంటూ వ్యాఖ్యానించడం క్యాడర్‌లో నిరాశ నిస్పృహలను నింపింది.

మిగతా 2లో..

# పరిరక్షించాల్సిన ప్రభుత్వమే భక్షిస్తుంది..




- 22ఎ పేరుతో కమిషన్ల దందా
- భూ భారతి పేరుతో భూములు హాంఫట్
- పేదల నివాస స్థలాల కోసం పోరాడింది కమ్యూనిస్టులే..
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ప్రజాపక్షం/ఖమ్మం : ప్రజల ఆస్తులను రక్షించాల్సిన ప్రభుత్వమే భక్షిస్తుందని భూ భారతి పేరుతో భూములను రక్షిస్తామన్న కాంగ్రెస్ పేదల భూములకు హారతి పట్టి ఆక్రమిస్తుందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకులు పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. 22ఏ పేరుతో కమిషన్ల దందాకు తెరలేపారని ఆయన తెలిపారు. శనివారం ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో బిఎల్‌ఏల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ 22ఎకు సంబంధించి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పిన రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి

మిగతా 2లో..

# హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కార్యాచరణ

## -నేటి నుంచి ఏఐటియుసి జిల్లా మహాసభలు




ప్రజాపక్షం/ఖమ్మం/సత్తుపల్లి : కార్మికులు అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను ప్రస్తుత పాలకులు హననం చేస్తుండగా హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) ఖమ్మం జిల్లా 17వ మహాసభలు నేటి నుంచి సత్తుపల్లిలో ప్రారంభం కానున్నాయి. సత్తుపల్లిలో ఏఐటియుసి జిల్లా మహాసభలు జరగడం ఇదే మొదటిసారి. సిద్దారం రోడ్డులోని లక్ష్మి ప్రసన్న గార్డెన్స్‌లో ఆది, సోమవారాల్లో ఈ మహాసభలు జరగనున్నాయి. మహాసభలను పురస్కరించుకుని మధ్యాహ్నం మూడు గంటలకు అంబేడ్కర్ చౌరస్తా నుంచి మహాసభలు

మిగతా 2లో..

# సన్నగిల్లుతున్న ఆశలు..!

(మొదటిపేజీ తరువాయి)
కోమటిరెడ్డి వెంకటరెడ్డి 22ఎకు సంబంధించి వ్యాఖ్యానిస్తూ 30 శాతం కమిషన్ అంటూ మాట్లాడటం అధికార పార్టీకి ఇబ్బందికరమే. కాంగ్రెస్ ఇలా ఇబ్బంది ఎదుర్కొంటున్న సమయంలోనే నామినెటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో తీవ్ర నిరాశ మిగిలింది. మూడేళ్లు కావస్తున్నా పూర్తి స్థాయిలో నామినెటెడ్ పదవులను భర్తీ చేయకపోవడం కొన్ని పదవులను భర్తీ చేసినా పూర్తి స్థాయిలో డైరెక్టర్లను నియామకం చేయకపోవడం పట్ల క్యాడర్‌లో నిరసన వ్యక్తమవుతుంది. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకి పదవులు పొందిన వారి పదవీ కాలం ముగిసింది. వీరిలో చాలా మంది వివిధ కార్పోరేషన్ ఛైర్మెన్లుగా పనిచేసిన వారు మరోసారి కార్పోరేషన్ పదవులను ఆశించడం లేదు. రెండేళ్లుగా పదవిలో ఉన్న ఏమి చేయలేకపోయామన్న అసంతృప్తి వారిలో వ్యక్త మవుతుంది. తమ పదవులను రెన్యువల్ చేస్తే బాగుండు అన్న ఆలోచన కూడా చాలా మందిలో లేదు. ప్రభుత్వం నామినెటెడ్ పదవులకు సంబంధించి తగిన ప్రాధాన్యతనివ్వలేదన్న భావన వ్యక్తమవుతుంది. కొద్ది మంది పదవుల నియామకం జరిగిన పూర్తి స్థాయి కమిటీలను ఏర్పాటు చేయలేదు. ఖమ్మం జిల్లాలో సుడా ఛైర్మన్‌ను పార్టీ అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లకు నియమించారు. కానీ ఇంత వరకు సుడా డైరెక్టర్లను కానీ, వైస్ ఛైర్మన్‌ను కానీ నియమించ లేదు. స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఏమి చేయాలి, నిర్ణయాలు ఏవిధంగా చేయాలి అన్న దానిపై స్పష్టత లేకుండాపోయింది. భద్రాచలం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ మూడేళ్ల నుంచి ఖాళీగానే ఉంటుంది. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన ఒక స్థాయి నాయకులను, కార్యకర్తలను తగిన రీతిలో ఆదరించడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తుండగా మరో పక్క ఎన్నికల ముందు కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన వారికి ప్రాధాన్యతనిస్తున్నారని ఆది నుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న వారికి పదవులు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వంపై స్వపక్షం నుంచే విమర్శలు రావడం మరో పక్క పదవులు రాని వారి అసంతృప్తితో ఉండటం పార్టీకి ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉండగా ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే పదవులు రావడం లేదని ఇప్పటికైనా ముగ్గురు మంత్రులు ఐక్యంగా నామినెటెడ్ పదవుల విషయంలో నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు. తప్పనిసరైన మార్కెట్ కమిటీలు నియామకం జరిగింది తప్ప మిగిలిన ఏ పదవులకు సంబంధించి నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా మంత్రులు, కాంగ్రెస్ అధిష్టానం ఆలోచన చేసి మరో రెండేళ్లు మాత్రమే గడువు ఉన్నందున నామినెటెడ్ పదవులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

# పకడ్బందీగా భూ రీ సర్వే చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి) పలు సూచనలు చేశారు. రైతుల స్వాధీనంలో ఉన్న భూములను సరిహద్దు రైతుల సమక్షంలో పరిశీలించి, వారి వాంగ్మూలాలను నమోదు చేయాలని సూచించారు. భూ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కచ్చితత్వంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియను రైతులు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. అనంతరం తహసీల్ధార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ రీ సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. వివరాలను నమోదు చేస్తున్న అధికారులకు పలు సూచనలు చేస్తూ, డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎర్రా ప్రగడ, తహసీల్ధార్ డి సైదులు, సర్వే, రెవెన్యూ బృందాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నీటి కుంటలతో భూగర్భ జలాల అభివృద్ధి...



రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు భూగర్భ జలాల పెంపునకు ఎంతగానో దోహదపడతాయని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. కూసుమంచి రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాన రహదారి నుంచి సుమారు 600 మీటర్లు నడిచి వెళ్లి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. వర్షపు నీటిని నిల్వ చేయడంతో పాటు భూమిలోకి నీరు ఇంకి బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు వివరించారు. నీటి నిల్వలతో భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్ధార్, కూసుమంచి ఏడీఏ, గ్రామ సర్పంచ్. ఏఓ, ఏపీఓ, ఈసీ,ఏఈఓ, పంచాయితీ కార్యదర్శి,వ్యవసాయశాఖఅధికారులు, టీఏలు, రైతులు పాల్గొన్నారు.

# హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి) జరగనున్న పోటు ప్రసాద్ నగర్ (లక్ష్మి ప్రసన్న గార్డెన్స్) వరకు కార్మిక ప్రదర్శన నిర్వహించనున్నారు. ప్రదర్శన అనంతరం జరిగే సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు తోపాటు సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య, ఐడిసి మాజీ ఛైర్మన్ మువ్వా విజయ్‌కుమార్, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండి యూసుఫ్, సోంటి బాలరాజు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరుకానున్నారు. ఈ మహాసభల సందర్భంగా వివిధ అంశాలకు సంబంధించి సెమినార్ నిర్వహించనున్నారు. సోమవారం ప్రతినిధుల మహాసభ ప్రారంభం కానుంది. ఏఐటియుసి అనుబంధ సంఘాలకు ప్రాతినిథ్యం వహిస్తూ 500 మంది ప్రతినిధులు మహాసభకు హాజరుకానున్నారు. సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన ఆర్టిసి, సింగరేణి తోపాటు ఆటో, హమాలీ, తదితర ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారు. శనివారం సత్తుపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు మాట్లాడుతూ ఏఐటియుసి మహాసభలను జయప్రదం చేయాలన్నారు. పాలకులు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు కార్యాచరణ ఈ మహాసభల్లో రూపొందించుకోనున్నట్లు నర్సింహారావు తెలిపారు. చాలీ చాలని వేతనాలతో కార్మికులు జీవిస్తున్నారని ఉద్యోగ భద్రత కరువైందని ఆయన తెలిపారు. ఈ రాష్ట్రంలో ఉన్న సంఘటిత అసంఘటిత కార్మికులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించి పోరాట కార్యాచరణను విడుదల చేస్తామని ఈ సందర్భంగా పలు తీర్మానాలను మహాసభలో పెట్టి చర్చించనున్నట్లు నర్సింహారావు తెలిపారు. మీడియా సమావేశంలో ఏఐటియుసి నాయకులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, నిమ్మటూరి రామకృష్ణ, బికెఎంయు నాయకులు దండు ఆదినారాయణ, డిహెచ్‌పిఎస్ ఉపాధ్యక్షులు తడికమళ్ల యోబు పాల్గొన్నారు.




# జానపద కళాకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జానపద కళాకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జానపద కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు పమ్మి రవి డిమాండ్ చేశారు. అంతరించిపోతున్న జానపద కళలను కాపాడడంతో పాటు కళాకారుల సంక్షేమాన్ని చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా సిపిఐ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు రాము అధ్యక్షతన జరిగిన సభలో పమ్మి రవి మాట్లాడుతూ కళారూపాలకు పూర్వ వైభవం తేవాలన్నారు. జానపద అకాడమీని ఏర్పాటు చేసి కళాకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 26న జరగనున్న జానపద కళా ఉత్సవాలను జయప్రదం చేయాలని రవి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, నాయకులు నాగేశ్వరరావు, గురవయ్య, నర్సింహారావు, పుల్లారావు, ఖమ్మం గర్జన, గంటా వీరభద్రం, చంద్రమోహన్, బొడ్డు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పెవిలియన్ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి 72వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ కమిటీ అధ్యక్షులు రామనాథం, మాజీ కార్పొరేటర్ బుడిగెం శ్రీనివాస్, సంఘం బాధ్యులు మందా వెంకటేశ్వర్లు, దామోదర్‌రెడ్డి, హరి, శేఖర్ పాల్గొన్నారు.

# పరిరక్షించాల్సిన ప్రభుత్వమే భక్షిస్తుంది..

(మొదటిపేజీ తరువాయి)
శ్రీనివాసరెడ్డి నిషేధిత భూములను తొలగించారా, ఆయన చెప్పినట్లు తప్పిదాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకున్నారా అనే దానిపై ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటేనే ఖతం పట్టించే పార్టీ అని ప్రజల ఇండ్లను, పేదల స్థలాలను ఎలా నిషేధిత జాబితాలో పెడతారని ఇప్పుడు దానిని తొలగించడానికి కమిషన్ల దందా కొనసాగిస్తున్నారని అజయ్‌కుమార్ తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలు పేదల నివాస స్థలాల కోసం పోరాటాలు చేశారని ఇందులో పార్టీ నాయకుల స్వార్థం లేదని ఆయన స్పష్టం చేశారు. కానీ పేదలు నిర్మించుకున్న ఇండ్లను కూలగొట్టడం ఒక్క కాంగ్రెస్‌పార్టీకే చెల్లిందని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేయడంతో పాటు డబుల్‌బెడ్‌రూం ఇండు నిర్మించి ఇస్తే కాంగ్రెస్ మాత్రం ఉన్న ఇండ్లను కూల్చివేసి ప్రజలను ఇబ్బందులు పెడుతుందన్నారు. కాంగ్రెస్ హస్తం అభయహస్తం అని చెబుతున్నారని కాని అది భస్మాసుర హస్తమని అజయ్‌కుమార్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని, విద్యార్థులకు రీయంబర్స్‌మెంట్ లేదని, తులం బంగారం సంగతేమో కానీ ఉన్న కళ్యాణలక్ష్మి ని ఊడగొడుతున్నారని వీటన్నింటికి కాంగ్రెస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. నెలకు రూ.2,500 ఇస్తానన్న హామీని, విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తానన్నది మరిచి మహిళలను కోటీశ్వరులను చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. రుణమాఫీకి సంబంధించి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిన ఏ గ్రామంలోనైనా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామం, మండలం ఏదో ఆయనే చెప్పాలని అజయ్‌కుమార్ కోరారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను బిఆర్ఎస్ మంజూరు చేస్తే ఇంత వరకు పంపిణీ చేయకుండా తాత్సరం చేస్తున్నారని కనీసం జర్నలిస్టుల సమస్యలనైనా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజీవ్ కెనాల్ పేరుతో చిన్న కాలువ తవ్వితే లైనింగ్ కొట్టుకుపోయిందని దానిపై వార్తలు రాయవద్దంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారని ఆయన తెలిపారు. ఎల్‌నినోతో తీవ్ర సమస్య రాబోతుందని ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకోవాలన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడం కాంగ్రెస్‌కు చేతకాదని కేసిఆర్ ముఖ్యమంత్రి అయితేనే సీతారామ పూర్తి అవుతుందన్నారు. అజయ్‌కుమార్ పోరాటాల నేపథ్యం నుంచి వచ్చాడని కొంత మంది బౌబౌలకు అజయ్‌కుమార్ భయపడడని ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. బిజెపి తుపేల్ ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందన్నారు. నగర మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, డిసిసిబి మాజీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీప్రసాద్, నాయకులు ఖమర్, మగ్బూల్, శీలంశెట్టి వీరభద్రం పాల్గొన్నారు. బిఎల్ఏలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

# ఎన్‌డిపిఎస్ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక శిక్షణ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని ఎన్‌డిపిఎస్ చట్టానికి సంబంధించిన కేసుల దర్యాప్తుపై పోలీసులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లీగల్ ఫోర్స్ ఎల్‌హెచ్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్ శిక్షణను శనివారం ఐఎంఏ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేశారు. సెక్షన్, అమలు విధానం కోర్టు విచారణ సమయంలో ఎదురయ్యే అంశాలపై వివరించారు. చిన్నపాటి లోపం తలెత్తినా విచారణ సమయంలో న్యాయపరమైన సమస్య తలెత్తే అవకాశం ఉందని నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఆధారాలతో కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎస్‌పి రోహిత్ రాజా మాట్లాడుతూ దర్యాప్తులో చోటు చేసుకున్న లోపాలు గుర్తించి సవరించుకోవడంతో పాటు చట్ట పరమైన నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్‌పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, మణుగూరు డిఎస్‌పి రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్‌పి వెంకన్నబాబు, భద్రాచలం డిఎస్‌పి అరుణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# 12వ వార్డులో రోడ్డు సమస్యకు పరిష్కారం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 12వ వార్డులో రోడ్డు బురదమయంగా మారడంతో సమస్య పరిష్కారానికి ఐర్లాండ్‌లో ఉన్న కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఐర్లాండ్‌లో ఉన్నప్పటికీ, గత రెండు రోజులుగా మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావుతో ఫోన్ ద్వారా సమస్యపై చర్చిస్తూ వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కౌనిసలర్ విజ్ఞప్తిపై స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, కమీషనర్ రామచంద్రరావు 12వ వార్డులో రోడ్డు మరమ్మత్తు పనులకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా యూస్‌డు డస్ట్ గ్రావెల్‌తో రోడ్డు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు. సమస్యపై స్పందించి వెంటనే మరమ్మత్తులు చేపట్టిన చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, కమీషనర్ రామచంద్రరావులకు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

# పార్థీనియం నివారణపై అవగాహన ర్యాలీ

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం వల్లాపురంలో పార్థీనియం నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వల్లాపురం గ్రామంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పార్థీనియం మొక్కల వలన కలిగే శ్వాసకోశ, చర్మ సంబంధిత సమస్యలపై విద్యార్థులు ప్రజలకు వివరించారు. పార్థీనియం వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల్లో ఈ మొక్కలను తొలగిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు శ్రీలేఖ, ఝాన్సి, ఉషశ్రీ, శ్రీజ, అంజలి, లేఖన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనాథ్‌రెడ్డి, రమేష్

**-యువతను విస్మరిస్తున్న పాలకులు**
**- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లాఖాద్రి**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం. శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్ ఎన్నికయ్యారు. 60 మందితో జిల్లా కౌన్సిల్‌ను, 22 మందితో ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మద్దోజు శ్రవణ్, ఉపాధ్యక్షులుగా మామిడాల కిరణ్ సహ పలువురిని మహాసభలో ఎన్నుకున్నారు. ఈనెల 21న చింతకాని మండలం కొదుమూరులో ఏఐవైఎఫ్ మహాసభలు జరిగాయి. శనివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో ప్రధాన కార్యదర్శి చింతల రమేష్ మాట్లాడుతూ మహాసభలో 17 తీర్మానాలను ఆమోదించడం జరిగిందని ఆ తీర్మానాల అమలు కోసం పోరాట కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. పాలకులు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడతామని స్పష్టం చేశారు.

**యువతను విస్మరిస్తున్న పాలకులు : వలీ**

పాలక వర్గాలు యువతను విస్మరించి పాలన చేస్తున్నాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రి తెలిపారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన మోడీ ఉన్న ఉద్యోగాలను ఊడబికుతున్నారని, రెండు లక్షల ఉద్యోగాల కల్పన హామీతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి అరకొర నోటిఫికేషన్లు తప్ప భర్తీ చేసింది లేదని ఆయన ఆరోపించారు. మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా విద్యను కాషాయికరణ చేస్తూ హిందూ మతోన్మాద చర్యలకు పాల్పడుతున్నారని ఖాద్రి ఆరోపించారు. దేశ వ్యాప్తంగా యువజన సమస్యలపై పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐవైఎఫ్ మాత్రమేనని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు, జిల్లా నిర్మాణ బాధ్యులు కొండపర్తి గోవిందరావు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల కిరణ్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు దుర్గానాథ్, కార్యదర్శి చిర్రా కృష్ణ ప్రసాద్, తుపాకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్‌సి, డిఏను వెంటనే ప్రకటించాలి

**-పెన్షనర్లు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తీరు మారాలి**
**-27న ఆందోళన**
**-పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సిని, డిఏను వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిపిఏటి ) జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా పెన్షనర్లు, ఉద్యోగుల పట్ల తమ వైఖరిని మార్చుకోవాలని ఆయన సూచించారు. పెన్షనర్ల సంఘం జిల్లా సమావేశం శనివారం కృషి భవన్‌లో జరిగింది. సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ పిఆర్‌సి, ఆరు డిఏల మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన తెలిపారు. మూడు నెలలుగా హెల్త్ ప్రీమియం మినహాయిస్తున్న ప్రభుత్వం నగదు రహిత వైద్యాన్ని అమలు చేయడంలో మాత్రం తీవ్ర తాత్సరం చేస్తుందని ఆయన తెలిపారు. 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లించలేదన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయడంలో ప్రభుత్వం కపట నీతిని ప్రదర్శిస్తుందని పుల్లయ్య తెలిపారు. పెన్షనర్లు, ఉద్యోగుల ఉమ్మడిసమస్యల పరిష్కారానికి ఈనెల 27న టిజిఈజెఏసి ఇచ్చిన పిలుపు మేరకు జరిగే మహాధర్నాలో పెన్షనర్లు అందరూ పాల్గొని సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పెన్షనర్ల సంఘం పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, నాయకులు తాడి అంజలి, ఊడుగు వెంకటేశ్వర్లు, రాధాకృష్ణమూర్తి, నాగప్రసాద్, ఊడుగు సుధాకర్‌రావు, ఎండి హుస్సేన్, ప్రసాదరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య సేవలపై సండ్ర ఆగ్రహం

**-వైద్యులు తీరు మార్చుకోవాలని సూచన**
**-పరిస్థితి మారకుంటే**
**కార్యక్రమం తీరు మారుతుందని హెచ్చరిక**



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని, బయట ప్రైవేట్ లు నడుపుతున్న వైద్యులు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతున్నారని, మరికొందరు అందుబాటులోనే ఉండడం లేదని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య సందర్శించారు. అనంతరం సూపరింటెండెంట్ సురేష్ నారాయణ తో భేటీ అయ్యారు. 100 పడకల ఆసుపత్రి భవనం, సుమారు 17 మంది వైద్యులు ఉన్నప్పటికీ సేవలు ఆశించిన స్థాయిలో లేకపోవడం బాధాకరమన్నారు. వైద్యులు సమయానికి విధులకు హాజరుకావడం లేదని, కొందరు ముందుగానే వెళ్లిపోతున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారనే ఆరోపణలపైనా విచారణ జరపాలని కోరారు. మంచి నీటి సమస్య, పోస్టుమార్టం ఆలస్యం, ధ్రువపత్రాల జారీకి డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలను పరిశీలించాలన్నారు. ఇటీవల రేజర్లకు చెందిన వ్యక్తిని పాము కాటుకు గురైన అనంతరం ఆసుపత్రికి తీసుకురాగా, సుమారు రెండున్నర గంటలపాటు యాంటీ స్నేక్ వెనం అందలేదని, పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సండ్ర డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన విషయంలో రాజకీయాలకు తావులేదని, ఆసుపత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకరరావు, వీరపనేని బాబి, మోరంపూడి ప్రభాకర్ , తుంబూరు దామోదర్ రరెడ్డి, కాల్నేని వెంకటేశ్వరరావు, ధను, మిద్దె శ్రీను, పర్వతనేని వేణు,జగదీష్, అమరవరపు కృష్ణారావు,అజార్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన ఐఏఎల్ శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయవాదుల శిక్షణా తరగతులు విజయవంతమయ్యాయి. ఈ శిక్షణా తరగతుల్లో ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ ఇన్ ప్రాక్టిస్ గురించి న్యాయవాదులకు శిక్షణనిచ్చారు. ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా సివిఎల్‌ఎన్ మూర్తి హాజరుకాగా అతిథులుగా ఆర్‌జెసి కృష్ణ, ఉదయ్ భాస్కర్, దుస్సా జనార్థన్, పోట్ల మాధవరావు, షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, పట్టాభి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## సుధాకర్‌రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/చింతకాని :** కమ్యూనిస్టు సిద్ధాంతాలపై అచంచల విశ్వాసంతో సామ్రాజ్యవాదం, మతత త్వం, దోపిడీకి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన పోరాట యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సిపిఐ జిల్లా మండల కార్యదర్శి దూసరి గోపాల రావు అన్నారు. శనివారం చింతకాని మండల కేం ద్రంలో సిపిఐ పార్టీ కార్యాలయంలో సురవరం సుధాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా గోపాలరావు మాట్లాడు తూ కార్మిక కర్షక పీడిత జనావళి కోసం సుధాకర్‌రెడ్డి త్యాగాలు వెలకట్టలేనివని స్పష్టం చేశారు. సుధాకర్‌రెడ్డి చూపిన కమ్యూనిస్టు ఉద్యమ పంథాలో ముందుకు సాగడమే ఆయనకు నిజమైన ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంకన్న, సిపిఐ నేరడ శాఖ సహాయ కార్యదర్శి మట్టా రవి, నాగరాజు, రత్నాకర్, చారి, కంచం రాజు, శ్రీరామ సైదులు, కొత్తకొండ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/చింతకాని :** తెలంగాణ ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం చింతకాని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ బాబు మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురుచూశారని కాంగ్రెస్ ప్రభుత్వం అదికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు చేశారన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోలా ఉమారాణి, వార్డు సభ్యులు కిలరు బాబురావు, పోనుగోటి బాబు, జీపీవో లక్ష్మి ప్రసన్న, నాయకులు కోలా నాగేశ్వరరావు, బండి వెంకటరమణ, షేక్ జానిమియా, డీలర్ కిలారు గోపిచంద్, గ్రామ పంచాయతీ సిబ్బంది లబ్దిదారులు పాల్గొన్నారు.

## విబిజి రామ్ జి రద్దు చేయాలి



**ప్రజాపక్షం/పెనుబల్లిః** విబిజి రామ్ జి పథకం రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ అన్నారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కమిటీ సమావేశం పెనుబల్లిలో గాయం తిరుపతి రావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన12 సంవత్సరాలలో వ్యవసాయ కార్మికులకు గాని, పేదలకు గాని, చేసిందేమీ లేదని ఆయన అన్నారు. ప్రజల నడ్డి విరిచి వసూలు చేస్తున్న జీఎస్టీ పనులను కూడా కార్పొరేట్ వాళ్లకు రాయితీలు ఇస్తున్నారన్నారు. వ్యవసాయ కార్మికుల మీద భారాలు వేస్తున్నారని ఆయన అన్నారు. వామ పక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు పోరాడి సాధించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబిజీ రాంజీ బిల్లు తెచ్చి కేంద్రం 60 శాతం భరిస్తుందని, రాష్ట్రాలు 40% భరించాలని షరతు పెట్టి అమలుకు పూనుకోవడం అంటే ఉపాధి హామీ చట్టాన్ని పేదలకు లేకుండా చేయడమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో చలమాల విఠల్‌రావు, జాజిరి శ్రీను పాల్గొన్నారు.

## మిస్ట్ కళాశాలలో ఇంటరాక్టివ్ వర్క్‌షాప్



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** వేగంగా మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ప్రముఖ రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ వివేక్ రాజశేఖర్ సూచించారు. మదర్ తెరిసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం "వేగంగా మారుతున్న ప్రపంచంలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం" అనే అంశంపై ఇంటరాక్టివ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రోగ్రామింగ్, కోడింగ్, అర్థమెటిక్, రీజనింగ్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన పెంచుకుంటే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాల్లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ కొత్తూరు ప్రభాకర్ రావు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో 2001లో కళాశాలను స్థాపించామని, అనేక మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ వివేక్ రాజశేఖర్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, ప్రెసిడెంట్ చలసాని సాంబ శివరావు, వైస్ ప్రెసిడెంట్ కొత్తూరు ప్రభాకర్ రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. ఉదయ్ కిరణ్ భార్గవ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి. రామచంద్రరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇల్లందు, డోర్నకల్ మధ్య మూడు పూటలా రైలు నడపాలి




**ప్రజాపక్షం/కారేపల్లి:** ఇల్లందు, డోర్నకల్ మధ్య మూడు పూటలా ప్యాసింజర్ రైలు పునరుద్ధరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అశోక్ అన్న వర్గం జిల్లా నాయకుడు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. రైలు సౌకర్యం కోసం రిలే నిరాహార దీక్ష చేస్తున్న కంచర్ల శ్రీనివాసరావుకు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇల్లందు నుంచి ఖమ్మం, కారేపల్లి, కొత్తగూడెం ప్రాంతాలకు నిత్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే అధికారులు, కేంద్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ తక్షణమే స్పందించి మూడు పూటలా రైలు నడపాలని కోరారు. రైలు పునరుద్ధరణతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంపీలు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

## విద్యతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది..



**ప్రజాపక్షం/పాల్వంచ :** సమాజంలో బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని, చదువుతోనే ఆత్మవిశ్వాసం పెరుతుందని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలతా లెనీనా అన్నారు. స్థానిక పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాలికా సాధికారత, కిశోర బాలికల సంరక్షణ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శనివారం ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. బాలికల సంరక్షణ, రక్షణ కోసం ప్రభుత్వం పలు చట్టాలను ప్రవేశపెట్టిందన్నారు. అత్యవసర సహాయం కోసం సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి వివరించారు.ఈ విద్యా సంవత్సరంలో బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, విద్య ప్రాముఖ్యత, వారు ఎదుర్కొన్న సవాళ్లు, పరిష్కారాలు, వారి భద్రత కోసం ప్రభుత్వం, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ తీసుకొంటున్న సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి అశం అనూష, ఐసిడిఎస్ జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ సంతోషి రూప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, క్లబ్ ఇంచార్జి పి. మాధవి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శేషగిరిరావును పరామర్శించిన తాటి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు అయితా శేషగిరిరావు హెర్నియా శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ, తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకార్ ఛైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు ఆయనను పరామర్శించారు. శేషగిరిరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న తాటి వెంకటేశ్వర్లు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శనగపాటి మెహరామణి, మాజీ సర్పంచులు బైటి రాజేష్, వాడే నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు శనగపాటి సీతారాములు, బండి కొమురయ్య, పుష్పాల చంద్రావు, కొండవీటి రాజారావు, ఎలమంచిలి సునీల్, పుష్పాల సాయి, పుష్పాల హనుమంతు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్‌లో ఎంఎల్‌ఏ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ఇల్లందు:** మండలంలోని బొజ్జాయిగూడెం ఏహెచ్ఎస్ హాస్టల్‌ను ఎంఎల్‌ఏ కోరం కనకయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్య వసతులపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. త్వరలోనే డైనింగ్ హాల్‌తో పాటు విద్యార్థులందరికీ సరిపడా మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాత్రి వేళ కొందరు విద్యార్థులు హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన ఘటనపై అధికారులపై ఎంఎల్‌ఏ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందించడంలో నిర్లక్ష్యం జరిగితే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, సొసైటీ ఛైర్మన్ మెట్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ అరెం కిరణ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మూగల మల్లేష్, గౌతమ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



**ప్రజాపక్షం/గుండాల :** విద్యార్థుల నడుమ క్యాస్టు ఫీలింగ్ సృష్టిస్తున్న ఏకలవ్య పాఠశాల గెస్ట్ ఉపాధ్యాయులను విధులనుండి తొలగించే వరకు ఉద్యమం ఆగదని, అరెస్టులతో ఉద్యమం ఆగదని తుడుందెబ్బ జాతీయ కార్యదర్శి కొడెం వెంకటేశ్వర్లు, చంద్రయ్యదొర, రమణబాబు శనివారం ఒక ప్రకటనలో ప్రకటించారు. అరెస్టులతో ఆదివాసీలను అనచి వేయాలని అనుకోవడంపాలకుల అవివేకం అని పేర్కొన్నారు. ఏకలవ్యగురుకుల పాఠశాలలో ఆదివాసీ విద్యార్థుల మీద జరుగుతున్న వికృత చేష్టలను అధికారులు చూశారని, ఆదివాసీ సంఘాల పోరాటాలకు న్యాయం చేస్తారని లేనియడల ఐటిడిఏ ముట్టడిస్తామని ప్రకటనలో ఆ పేర్కొన్నారు.

# ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయం..!

**-కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్న అధికారుల నిర్లక్ష్యం**
**-ప్రాణాలు పోతేగానీ పట్టించుకోరా..?**





**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలంలోని గొల్లపూడి, తాటిపూడి గ్రామాల పరిధిలో రహదారులపై ఏర్పడిన భారీ గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. రహదారిపై ఎక్కడ గుంత ఉందో అందులో వాహనం దిగితే ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గొల్లపూడి గ్రామంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా గుంతల్లో దిగడంతో అదుపుతప్పే పరిస్థితి నెలకొంది. ఆర్‌టిసి బస్సులు గుంతల్లో దిగినప్పుడు బస్సుస ముందు భాగం రోడ్డుకు బలంగా తగలడంతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్లు, ద్విచక్ర వాహనదారులు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తాటిపూడి నుంచి రెబ్బవరం వరకు రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, వైరా నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు కూడా పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదాలు జరిగితే స్పందిస్తారా?**

రోడ్డుపై భారీ గుంతలు కళ్లకు కనిపిస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాతే అధికారులు స్పందిస్తారా అని ప్రశ్నిస్తున్నారు.

**గుంతల గురించి ఆలోచించండి సారూ...**

ఆర్‌అండ్‌బి అధికారులు ఒక్కసారి క్షేత్రస్థాయిలో పర్యటించి రహదారుల పరిస్థితిని పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు జరగకముందే గుంతలను పూడ్చి రహదారికి మరమ్మత్తులు చేపట్టి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అధికారులు నిర్లక్ష్యం వీడాలి : యామాల గోపాలరావు**



ఆర్‌అండ్‌బి అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. రహదారులపై ఏర్పడిన గుంతలను చూస్తే భయమేస్తుందని, రాత్రివేళ ఈ మార్గంలో ప్రయాణించాలంటే ఇంటి నుంచి వెళ్లిన వారు క్షేమంగా తిరిగి వస్తారో లేదోననే ఆందోళన కలుగుతుందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి రహదారికి మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఆయన డిమాండ్ చేశారు.

# బాలల హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

**మణుగూరు మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి**




**ప్రజాపక్షం/మణుగూరు:** విద్యార్థులు చదువుతో పాటు రాజ్యాంగ విలువలు, ప్రాథమిక విధులు, తమ హక్కులు, బాధ్యతలు, బాలల రక్షణకు అమలులో ఉన్న చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మణుగూరు మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి సూచించారు. శనివారం మణుగూరులోని తెలంగాణ గిరిజన సంక్షేమ ఉన్నతీకరించిన రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికలు)లో నిర్వహించిన న్యాయ అవగాహన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రాజ్యాంగం పౌరులకు హక్కులతో పాటు దేశ సమగ్రతను కాపాడటం, ఇతరులను గౌరవించడం, ప్రజా ఆస్తులను పరిరక్షించడం వంటి ప్రాథమిక విధులను కూడా నిర్దేశించిందని వివరించారు. బాలలకు విద్య, భద్రత, గౌరవప్రదమైన జీవనం హక్కులని, వారిపై హింస, వేధింపులు, దోపిడీ జరిగినప్పుడు చట్టపరమైన రక్షణ పొందవచ్చని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం బాలికకు 18 ఏళ్లు, బాలుడికి 21 ఏళ్లు నిండకముందు వివాహం చేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. బాలలను ప్రమాదకరమైన పనుల్లో నియమించడం, వారి చదువుకు ఆటంకం కలిగేలా శ్రమకు గురిచేయడం చట్టరీత్యా నేరమని వివరించారు. పోక్సో చట్టం కింద 18 ఏళ్లలోపు బాలబాలికలకు లైంగిక వేధింపులు, దాడులు, అసభ్య ప్రవర్తన నుంచి ప్రత్యేక రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. తమకు ఎదురయ్యే వేధింపులను భయంతో దాచకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా విశ్వసనీయ పెద్దల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని సూచించారు. అనంతరం మణుగూరు న్యాయవాదులు పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీనేజ్‌లో భావోద్వేగాలు, క్షణికావేశం ప్రభావంతో తీసుకునే నిర్ణయాలు ఒక్కోసారి చట్టపరమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉందని వివరించారు. ఆ వయసులో తాము భావించేదే సరైనదనే భ్రమకు లోనుకాకుండా, ఏదైనా కీలక నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బాధ్యత గల పెద్దల సలహా తీసుకోవాలని సూచించారు. చిన్న వయసులో చేసే పొరపాటు చదువు, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున భావోద్వేగాల కంటే విచక్షణ, పరిపక్వతతో వ్యవహరించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు కృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాదులు సావిత్రి, నరసింహారావు, భాస్కర్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ రాణి, ఎంఎల్‌ఎస్సీ కోఆర్డినేటర్ రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఆగస్టు 6 నుంచి 12 వరకు నిర్వహించే ప్రజా చైతన్య యాత్రను, సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ ఇల్లందు మండల కార్యదర్శి బొబ్బిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జిల్లా రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు సాగునీరు అందించాలని, పెండింగ్ పోడు పట్టాలు మంజూరు చేయడంతో పాటు పేదలందరికీ ఇళ్లు దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. హనుమంతలపాడు, కరెంట్ ఆఫీస్, రాజీవ్‌నగర్, ఏతండా, రేపల్లెవాడలో కరపత్రాల పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, తెలంగాణ గిరిజన సమైక్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగులోత్ కృష్ణ, రామ్మూర్తి, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సురవరం ఆశయాలను సాధించాలి

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి, వీసంశెట్టి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించిన , పేద,బడుగు, బలహీన వర్గాల పక్షపాతి సురవరం సుధాకర్‌రెడ్డి అని,ఆయన ఆశయాలను సాధించటానికి మనమంతా కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావులు అన్నారు. సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలను సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వర రావు భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో పేదలు, కార్మికులు, కర్షకులు, రైతులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని అన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, రైతి సంక్షోభం, కార్మిక హక్కులు, వ్యక్తుల ఆర్థిక, సామాజిక హక్కుల రక్షణకు ఆయన నిత్యం పోరాటం చేశారని స్పష్టం చేశారు. ప్రధానంగా దేశంలో 21 ఏండ్లకు ఓటు హక్కు ఉండేదని దాని స్థానంలో 18 సంవత్సరాలకు ఓటు హక్కు కల్పించాలని రెండు దశాబ్దాల పాటు సాగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి యువజన రాజకీయ హక్కులను కలగజేసారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా అనంతరం ఎస్ఎఫ్, వైఎఫ్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీ ఉంటూ విద్యార్థి, యువజన ఉద్యమాలను దేశ వ్యాప్తంగా విస్తరించటానికి విశేష కృషి చేశారని వెల్లడించారు. సురవరం నేతృత్వంలో పని చేసిన అనేక మంది యువజన, విద్యార్థి నాయకులు తరువాత కాలంలో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ నాయకులుగా ఎదిగారని చెప్పారు. చక్కటి వాగ్దాటి, విషయ స్పష్టత కలిగిన వక్త అని కొనియాడారు. ఒకతరం విద్యార్థి, యువజనులకు ఆయనో ఆకర్షణ, గుర్తింపు పొందిన పార్లమెంటేరియన్‌గా కీర్తి గడించిన గొప్ప నాయకుడని స్పష్టం చేశారు. సురవరం సుధాకర్‌రెడ్డి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్మించాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శనిగారపు శ్రీనివాసరావు, డి. చెన్నయ్య, బిక్కులాల్, నామా పండు, ఎస్కే. కరీమ్, రాము, బాబు, వెంకట్, రామక్రిష్ణ, క్రిష్ణ, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, కిరణ్, రమేష్, ప్రసాద్, వీరు, సత్యనారాయణ, లాల్‌పాషా,రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం నిర్ణయాలను తప్పపట్టే వారికి పార్టీలో కొనసాగే హక్కు లేదు..

**-కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలి**
**-వైరా ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్**



**ప్రజాపక్షం/కారేపల్లి:** కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాలను బహిరంగంగా తప్పుపట్టే వారికి పార్టీలో కొనసాగే నైతిక హక్కు లేదని వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం సాయంత్రం కారేపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహించని మంత్రి కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని రాందాస్ నాయక్ డిమాండ్ చేశారు. పార్టీకి సంబంధించిన అంతర్గత అంశాలను నాయకులు అంతర్గతంగా చర్చించుకోవాలే తప్ప బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలహీనపర్చేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను మంత్రి కొండా సురేఖ అమలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ పార్టీని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేసేలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాల్సిన నాయకులే వారిని అయోమయానికి గురిచేసే విధంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై అధిష్ఠానం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# హౌస్ కీపర్లు, ఆఫీస్ సబార్డినేట్ల ను జేపీఏలుగా కన్వర్షన్ చేయండి



**ప్రజాపక్షం/మణుగూరు:** బిటిపిఎస్ లో పనిచేస్తున్న హౌస్ కీపర్లు, ఆఫీస్ సబార్డినేట్లను జేపీఎ (జూనియర్ ప్లాంట్ అటెండెంట్ )లుగా కన్వర్షన్ చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 నాయకులు ఆ కర్మాగార చీఫ్ ఇంజనీర్ బి.బిచ్చన్న ను కోరారు. టీఎస్‌పీఈయూ1535 రీజినల్ అధ్యక్షులు వి. ప్రసాద్, స్టేట్ జాయింట్ సెక్రటరీ ఏ. వెంకటేశ్వర్లు, కోశాధికారి పి. శ్రీనివాస్ తదితరులు బిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో శనివారం ఆయన కలసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. 31,ఆగస్టు 2026 తేది వరకు ఐదు ఇంక్రిమెంట్లు తీసుకున్న హౌస్ కీపర్ లను జేపీలుగా కన్వెన్షన్ చేసేందుకు జెన్కో ఇటీవల సర్క్యులర్ విడుదల చేసిందని చెప్పారు. అయితే ఈ గడువుని 30, నవంబర్2026 వరకు పొడగించాలని కోరారు. ఈ మూడు నెలలు పొడిగిస్తే హౌస్ కీపర్ లందరూ జెపిఏ లుగా కన్వర్షన్ అవుతారని గుర్తు చేశారు. కర్మాగారం లో ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసి పదో తరగతి పాసైన ఆఫీస్ సబర్డేనేట్ల అందరిని జెపిఎ లుగా కన్వర్షన్ చేసే జీవో ఉందని చెప్పారు. ఈ జీవో ను అనుసరించి ఆఫీస్ సబార్డినేట్లను జెపిఎ గా కన్వర్షన్ చేయాలని కోరారు. భూ నిర్వాసిత కోటాలో నియమితులైన జూనియర్ అసిస్టెంట్ల సర్వీసును డేటాఫ్ జాయినింగ్, డేట్ అఫ్ బర్త్ ను పరిగణలోకి తీసుకొని నిర్ణయించాలని పేర్కొన్నారు. హౌస్ కీపర్ లకు గడువు పెంచేందుకు,ఆఫీస్ సబార్డినేట్లను జెపిఎలు గా కన్వర్షన్ చేసేందుకు చీఫ్ ఇంజనీర్ సానుకూలంగా స్పందించారు. జూనియర్ అసిస్టెంట్ల సీనియారిటీని నిబంధనలను అనుసరించి నిర్ణయిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేట్లు గౌస్ పాషా,కళ్యాణ్, రాము, నరసింహారావు, అప్పియ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని పల్లెల్లో గంజాయి పొగలు..!




**ప్రజాపక్షం/కామేపల్లి:** పచ్చని పంట పొలాలతో కళ, కళ లాడాల్సిన గ్రామాలు నేడు గంజాయి పొగలతో విలవిల లాడుతున్నాయి. నవ భారత నిర్మాణానికి వెన్నుముకగా, నివాల్సిన యువత నేడు చెడు వ్యసనాల బారిన పడుతూ తమ జీవితాలను, కుటుంబాలను, నాశనం చేసుకుంటున్నారు. జీవితమంటే ఇదే అనుకుంటున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి సాయంత్రం పడుకునే వరకు మద్యం, మాంసం, గంజాయి, గుట్కాలు, సిగరెట్లు తదితర వాటిని త్రాగడం, సేవించడం వంటి కార్యక్రమాలతో యువత మునిగితేలుతోంది. ఇదే జీవితం అన్నట్లుగా ఎంజాయి చేస్తున్నారు. దేశ భవిష్యత్తును కాపాడాల్సిన యువత ఈ విధంగా వ్యవహరిస్తుంటే, దేశ భవిష్యత్తు ఎలా అని పలువురు ఆందోళన చెందుతున్నారు. పాలకులు, ప్రభుత్వాలు, అధికారులు డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని గొప్పలు చెబుతున్నారే కానీ, వాటిని ఆచరణలో పెట్టి అమలు చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి చట్టాలను కఠినంగా అమలు చేసి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని, యువతను చెడు వ్యసనాల నుంచి కాపాడాలని యువకులు తల్లిదండ్రులు, ప్రజలు, యావత్ సమాజం కోరుతుంది. మన భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుందాం...

## హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన రేగా



**ప్రజాపక్షం/అశ్వాపురం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావు హైదరాబాద్ కోకాపేటలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎంఎల్‌ఏ తన్నీరు హరీష్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇరువురు నేతలు పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. రేగా కాంతారావుతో పాటు అశ్వాపురం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, పినపాక బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి, అశ్వాపురం మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మిట్టకంటి సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కమిటీల జాబితా అందజేత



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలోని 24 పంచాయితీల కాంగ్రెస్ పార్టీ కమిటీల జాబితాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్నకు మండల కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు ఆధ్వర్యంలో కమిటీల వివరాలను అందజేశారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా కమిటీలను ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఎస్కే గాలిబ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేములవిజయ్, తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు అందిస్తున్న భోజనం పరిశీలన



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ గుండె వెంకన్న శనివారం పరిశీలించారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత తప్పని సరిగా పాటించాలని సూచించారు. వైద్య సేవలతో పాటు పౌష్టికాహారం అందించడం కూడా ముఖ్యమన్నారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గుర్రం ప్రసాద్ మాట్లాడుతూ రోగులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో రాజీ ఉండదని తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలతో పాటు పౌష్టికాహారం అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల హరీష్, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం పిల్లలకు ఆహారమందించాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రతి రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని కామేపల్లి సెక్టార్ సీడీపీవో ఉమా సూచించారు. శనివారం మండలంలోని బురద రాఘవాపురం, లచ్చగూడెం, జన్నారం అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి, రికార్డులు, నిల్వలను పరిశీలించారు. పిల్లల ఎత్తు, బరువును పరిశీలించడంతో పాటు వారికి అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. గర్భిణులకు పౌష్టికాహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ భవాని, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, సరస్వతి, ఆంధ్రవాణి, గర్భిణులు పాల్గొన్నారు.

## అప్పాయిగూడెంలో పారిశుధ్య, డ్రైనేజీ పనులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించే లక్ష్యంతో అప్పాయిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలో పారిశుధ్య, డ్రైనేజీ, నూతన పైప్‌లైన్ పనులు చేపట్టారు. పారిశుధ్య పనుల్లో భాగంగా రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, పిచ్చి మొక్కలను ట్రాక్టర్ సహాయంతో తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. దోమలు, ఈగలు, వ్యాధికారక క్రిముల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈసందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిలిచే సమస్యలను తగ్గించడంతో పాటు గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ రోడ్లపై చెత్త వేయకుండా పంచాయితీకి సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కృష్ణవేణి, పంచాయితీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఖిల్లా రోప్‌వే పనులు వేగవంతం చేయాలి



-పర్యాటకుల కోసం పార్కింగ్ స్థలాన్ని గుర్తించాలి
-షీట్ రాక్ ప్రాంతంలో అవసరమైన పరీక్షలు నిర్వహించాలి
-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శనివారం కలెక్టర్ దివాకర టిఎస్ ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులు, జరుగుతున్న నిర్మాణ ప్రక్రియ, పనుల పురోగతి తదితర వివరాలను అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఖిల్లాపైన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోప్ నిర్మాణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని పనుల్లో వేగం పెంచాలన్నారు. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ముందస్తుగానే పక్కా ప్రణాళికతో సమకూర్చుకోవాలన్నారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రోప్‌వే నిర్మాణంలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం తనివ్వాలన్నారు. ఖిల్లా ప్రాంతంలో షీట్ రాక్ ఉన్నందున జియాలజిస్టుతో సమన్వయం చేసుకుని భౌగోళిక పరిస్థితులను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. ఖమ్మం ఖిల్లాకు పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక కార్యక్రమాలు, సౌకర్యాలు ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలన్నారు. ఖిల్లాపై స్టార్ గేజింగ్ కోసం టెలిస్కోప్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకుల వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని గుర్తించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖాధికారి సుమన్ చక్రవర్తి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కన్నతల్లిని.. మాతృభూమిని ఎన్నటికీ మరువద్దు

లయన్స్ జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేంద్రరావు



ప్రజాపక్షం/వైరా: విద్యార్థులు జీవితంలో ఎంతటి ఉన్నత స్థానాలకు చేరుకున్నా కన్నతల్లిని పుట్టి పెరిగిన ఊరిని, మాతృభూమిని ఎన్నటికీ మరువకూడదని లయన్స్ జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్, గుట్టబడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ప్రధాన కార్యదర్శి పెనుగొండ ఉపేంద్రరావు అన్నారు. గొల్లెనపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్.తిరుమలయ్య అధ్యక్షతన ఉపాధ్యాయురాలు బండారు సరిత ప్రత్యేక చొరవతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుతం అమెరికా స్థిరపడిన వెంపటి సత్యవర్ధన్ రావు తన స్వగ్రామానికి పాఠశాలను గుర్తు చేసుకుంటూ విద్యార్థుల కోసం రూ.20వేలు విలువైన స్కూల్ బ్యాగులను అందజేశారు. పాఠశాల స్కావెంజర్‌కు నిత్యావసర సరుకులను కూడా తన తల్లి రమాదేవి ద్వారా అందించారు. ఈ కార్యక్రమానికి ఆయన భార్య, స్రవంతి, కుమార్తెలు రాగ వైష్ణవి, మేఘన సహకరించారు. సత్యవర్ధన్‌రావు తన స్వగ్రామంలోని విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవడం అభినందనీయమని ఉపేంద్రరావు కొనియాడారు. విద్యార్థులకు అవసరమైన బ్యాగులను అందించేందుకు ఉపాధ్యాయురాలు బండారు సరిత తీసుకున్న చొరవను ప్రశంసించారు. అనంతరం జివి మాల్ వారి సహకారంతో విద్యార్థులక బ్రౌజర్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డయాబెటిస్, బాల్య క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సామ్రాజ్యం మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమలో వార్డు మెంబర్ లీలమ్మ, ఉపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్, జి.రామకృష్ణ, బండారు సరిత, జి.గృహలక్ష్మి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని సత్యవర్ధన్‌రావు ఆయన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# డిహైడ్రేషన్‌కు ఓఆర్ఎస్ ఎంతో ఉపయోగకరం

-డిఎంహెచ్‌ఓ డాక్టర్ డి రామారావు



ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: విరోచనాలు, వాంతులతో శరీరంలో నీరు, ముఖ్యమైన లవణాలు కోల్పోయి డిహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. సకాలంలో ఓరల్ రిహైడ్రేషన్ సొల్యూషన్ ఇవ్వడం ద్వారా డిహైడ్రేషన్ నివారించవచ్చని సూచించారు. డబ్ల్యూహెచ్‌ఓ కూడా డయేరియా చికిత్సలో ఓఆర్ఎస్‌ను కీలకమైన ప్రాణరక్షక చర్యగా పేర్కొంటోందని తెలిపారు. విరోచనాలు, వాంతుల వల్ల కోల్పోయిన నీరు,సోడియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లను ఓఆర్ఎస్ భర్తీ చేస్తుందని తెలిపారు. ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను, ప్యాకెట్‌పై సూచించిన పరిమాణంలో, సాధారణంగా ఒక లీటర్ శుభ్రమైన నీటిలో కలిపి వినియోగించాలని, తయారుచేసిన ద్రావణాన్ని 24 గంటల్లోపు వాడాలని సూచించారు. విరోచనాల సమయంలో చిన్నపిల్లలకు తల్లిపాలను కొనసాగిస్తూ, కొద్దికొద్దిగా ఓఆర్ఎస్ ఇవ్వాలని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలకు వైద్యుల సూచన మేరకు జింక్ సప్లిమెంట్లు ఇవ్వడం వల్ల డయేరియా తీవ్రత, వ్యవధి తగ్గుతుందని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంటుందని తెలిపారు. తీవ్రమైన విరోచనాలు, వాంతులు, అధిక జ్వరం, అధిక చెమట, వడదెబ్బ, తగినంత నీరు తీసుకోకపోవడం వంటి కారణాలతో డిహైడ్రేషన్ ఏర్పడే అవకాశం ఉందన్నారు. బిపి, మధుమేహం, కిడ్నీ సమస్యలు ఉన్నవారు స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. కళ్లు గుంటలు పడటం, మూత్ర విసర్జన బాగా తగ్గడం, విపరీతమైన మత్తు, మలంలో రక్తం కనిపించడం వంటి తీవ్ర లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని డాక్టర్ రామారావు సూచించారు. పరిశుభ్రమైన నీటిని తాగడం, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, ఆహార పరిశుభ్రత పాటించడం ద్వారా విరోచనాలను నివారించవచ్చని తెలిపారు.

# కుప్పెనకుంట్ల-పేరువంచ రహదారి సమస్యపై క్షేత్రస్థాయి పరిశీలన



ప్రజాపక్షం/పెనుబల్లి: కుప్పెనకుంట్లపేరువంచ రహదారికి సంబంధించిన సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించబడింది. ఈ సందర్భంగా రహదారి పరిస్థితిని, సంబంధిత సమస్యలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో పాటు ప్రభావిత రైతులతో చర్చించి, వారి సమస్యలు మరియు అభ్యంతరాలను తెలుసుకున్నారు. సమస్యకు సాధ్యమైన పరిష్కార మార్గాలపై అధికారులతో సమీక్షించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలు మరియు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చట్టబద్ధమైన, ఆచరణ సాధ్యమైన మరియు సానుకూల పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.సంబంధిత శాఖల నివేదికలు మరియు సిఫారసుల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



ప్రజాపక్షం/రఘునాథపాలెం : ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని వేపకుంట్ల సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా తెలిపారు. శనివారం గ్రామా నికి ఐలా సుధాకర్ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌లో ఉద్యాన అధికారి జి. నగేష్, సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజాలు పాల్గొని మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు లాభదాయకమన్నారు. ఆయిల్ పామ్ పంటకు కోతుల బెడద లేదని ఒక్కసారి వేస్తే 30 సంవత్సరాల వరకు ఆదాయం ఇచ్చే పంట అన్నారు. ఉద్యాన అధికారి జి. నగేష్ 2026 సంవత్సరంలో ఇప్పటి వరకు మండలంలో వెయ్యి ఎకరాలలో ప్లాంటేషన్ జరిగిందన్నారు. ప్రభుత్వం నుండి ఎకరాకు రూ. 50వేలు రాయితీ కూడా ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా వక్క, ఖోఖో, మునగ, సుగంధ పంటలు వేసుకుని అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు మృతి



ప్రజాపక్షం/రఘునాథపాలెం : రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ జింకలతండా క్రాస్ రోడ్డు వద్ద జరిగిన కారు ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో అన్నాచెల్లెలు మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గుండెటి శ్రీను (18), గార్లపాటి రిషిక (10)లు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఖమ్మం రమణగుట్టకు చెందిన గార్లపాటి ముత్తయ్యకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె రిషిక ఖమ్మంలో నాల్గవ తరగతి చదువుతుంది. పాఠశాలకు రెండు రోజులు సెలవులు రావడంతో రఘునాథపాలెంలోని మల్లేపల్లి గ్రీన్ కాలనీలో నివసిస్తున్న తన పెద్దమ్మ ఇంటికి వెళ్లేందుకు పెద్దమ్మ కొడుకు వరుసకు సోదరుడైన శ్రీనుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ జింకలతండా క్రాస్ రోడ్డు సమీపంలో ద్విచక్రవాహనం పై రోడ్డు దాటుతుండగా ఇల్లందు నుంచి ఖమ్మం వైపు వస్తున్న కారు అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రిషిక అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి శ్రీను, రిషికలు మృతిచెందినట్లు తెలిపారు. శ్రీను తండ్రి గుండెటి కృష్ణ సుతారి పని చేస్తున్నాడు. అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడపడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని రిషిక తండ్రి ముత్తయ్య ఫిర్యాదు చేశారు. కారును భూక్యా కోటేశ్వరరావు అనే వ్యక్తి నడుపుతున్నట్లు తమకు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీను, రిషికల మృతితో ఇరు కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయారు. గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# కళాశాలలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం



ప్రజాపక్షం/మధిర: డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఖమ్మం ఆదేశాల మేరకు లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిరలో ప్రిన్సిపాల్ జి.శంకర్, ఎన్ఎస్ఎస్ పివో బి.తేరిసా ఆధ్వర్యంలో ఖమ్మం డిస్ట్రిక్ట్ లీగల్ అవేర్నెస్ మెంబర్ సునీత, సుజాత ఈ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రూపారెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతో బాధ్యతతో పనిచేసిన విద్యావేత్త, ఒక ప్రిన్సిపాల్‌గా విద్యార్థులకు క్రమశిక్షణ, మంచి నడవడి, బాధ్యత వంటి విలువలను నేర్పడం ఆమె బాధ్యతగా భావించారు. విద్యార్థులారా, ఈ ఘటన మనందరికి ఒక గుణపాఠం కోసం, చెడు అలవాట్లు, డబ్బుపై అత్యాశ, తప్పు స్నేహాలు మనిషి జీవితాన్ని ఎంతటి విషాదానికి దారితీస్తాయో మనం ఆలోచించాలి. ఏ సమస్య వచ్చినా హింసకు పాల్పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహాయం తీసుకోవాలి. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. (మైనర్లు) స్టూడెంట్స్ బైక్ డ్రైవింగ్, అతివేగంతో డ్రైవింగ్ చేయరాదు. ఫోక్స్ యాక్ట్‌పై అవగాహన విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యు.కృష్ణ, ఆర్‌సిహెచ్ సాంబయ్య, జి.కృష్ణ, బి.ఉపేందర్, టి.నాగరాజు, ఎం.లాలయ్య, కె.కొండలరావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొని ఉన్నారు.

# శ్రీనిధి కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



ప్రజాపక్షం/మధిర: స్థానిక రెడ్డి గార్డెన్స్ నందు శనివారం శ్రీనిధి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీనిధి విద్యాసంస్థల అధినేత అనిల్‌కుమార్ నెహ్రూ నేతృత్వంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రూరల్ సిఐ మధు, టౌన్ ఎస్సై నమిత పాల్గొనారు. సిఐ మధు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు దిశా దశను నిర్దేశించారు. ప్రస్తుతం యువత అనేక వ్యసనాలకు బానిసలు అవుతూ హింసించే మార్గమును ఎంచుకొని వారి భవిష్యత్తును తరగతి గదిలో తీర్చిదిద్ది గురువుకు రక్షణ లేని సమాజంలో ఉండటం మన దురదృష్టకరం అని విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా తమ భవిష్యత్తును తెలుసుకొని ఉన్నత స్థానాలకే ఎదగాలని ఆశించారు. సభా కార్యక్రమం అనంతరం విద్యార్థిని, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకునే విధంగా సాంప్రదాయ నృత్యాలు అందరిని అలరించే విధంగా కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల గొంతుక సురవరం









**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బడుగు బలహీన వర్గాల గొంతుక సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే ఫహీం అన్నారు. సురవరం ప్రథమ వర్ధంతి సభ శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్, నేరెళ్ల రమేష్ భూక్యా శ్రీనివాస్ రత్నకుమారి నాయకులు ఎండి యూసఫ్ గోపి కృష్ణ ధర్మరాజు మిర్యాల రాము షహీన్ రైసర్ మేదిని లక్ష్మీ చోటు షరీఫ్ అఫ్జల్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

**భద్రాచలంలో :** సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి స్థానిక సిపిఐ కార్యాలయంలో పట్టణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్విహంచారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీనియర్ నాయకులు మీసాల భాస్కర్ రావు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం టౌన్ కన్వీనర్ మారెడ్డి శివాజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ నాయుడు సాధనపల్లి సతీష్, కొక్కిరేణి అశోక్, శోభన్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

**చర్లలో :** సురవరం ప్రథమ వర్ధంతి చర్ల సిపిఐ కార్యాలయంలో జరిపించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోటి మత్యాలరావు, కోడిరెక్కల రాజారావు, మనిగల రామారావు, ఆంద్రు వామనరావు, నర్సింహారావు, మోడెమ్ ఆదినారాయణ, కూసం దుర్గాప్రసాద్, సత్యనారాయణ, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

**అశ్వారావుపేటలో :** సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలే మార్గదర్శకం అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ సలీం అన్నారు. సురవరం ప్రథమ వర్ధంతి పేటలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గన్నిన రామకృష్ణ, చీపుర్ల సత్యవతి, నాయకులు దిల్షాద్, శ్రావణి, వాసు, వెంకన్న, ప్రసాద్, రామకృష్ణ, రూతు కార్యకర్తలు, ప్రజా సంఘాల బాధ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పాల్వంచలో :** పేద బడుగు బలహీన వర్గాల పక్షపాతి సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు అన్నారు. మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం ప్రథమ వర్ధంతి పాల్వంచ చంద్ర రాజేశ్వరరావు భవన్లో జరిగింది. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పుశెట్టి రాహుల్, వి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, డి చెన్నయ్య, బిక్కులాల్ నామ పందు కరీం, రాము బాబు వెంకట్, రామకృష్ణ, వెంకన్న అల్లి వెంకటేశ్వర్లు కిరణ్ రమేష్ ప్రసాద్ వీరు సత్యనారాయణ లాల్ పాషా రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

**మండల స్థాయి సమీక్షలో అధికారుల వెల్లడి**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రస్తుత పరిస్థితుల ఎల్నీ ను ఎదుర్కనేందుకు సిద్ధంగా ఉండాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం లో మండల స్పెషల్ ఆఫీసర్ కె.రవిబాబు ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా సమీక్ష చేశారు. అనంతరం చైర్మన్ సీతారాములు మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకుటుందన్నారు. సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అధికారులు విధులను చిత్తశుద్ధితో చేసి ప్రభుత్వం లక్ష్యం ను నెరవేర్చాలని సూచించారు. ఎల్నినో తట్టుకునేందుకు నీటిని. పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ యం.యర్రయ్య మాట్లాడుతూ, మొదటి విడత లోని ఇందిరమ్మ ఇళ్ల ను ఆక్టోబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. రెండో విడత లో 600 ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేశారన్నారు. పూరి గుడిసెలు, టార్పాలిన్ ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫించన్ ల దరఖాస్తులు నిబంధనల మేరకు ఆన్లైన్ చేయనున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ జెఈ మాధవి మాట్లాడారు... రానున్న కాలంలో ఎల్నినో వలన అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. నీటిని వృధా చేయకుండా, పొదుపు గా వాడుకోవాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు, ఆయా పంచాయతీ సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు రాయపూడి రామారావు, కట్టెకోల నాగార్జున, శీలం వెంకటలక్ష్మి, బోయిన వేణు, కమదన ప్రవీణ్, దండా రంగయ్య, ధీరావత్ ఆశోకరాణి, అమరగాని యల్లయ్య, తేజావత్ శివాజీ, గుండపనేని లక్ష్మణావు. ఏలూరి రామారావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలి

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే పద్ధతులను ప్రభుత్వం వెంటనే మానుకోవాలి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. శనివారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేసి ప్రభుత్వ విధానాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో అనుసంధానం చేసే ఆలోచన సరైంది కాదని, ఇప్పటికైనా విరమించుకోవాలన్నారు. ఈ నిర్ణయం అమలైతే వేలాది మంది విద్యార్థుల విద్యా ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోలన వ్యక్తం చేశారు. డిప్లొమా విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించే లాటరల్ ఎంట్రీ విధానాన్ని రద్దు చేయవద్దని అజిత్ ఈ సందర్భంగా కోరారు. విద్యార్థులకు నష్టాన్ని కలిగించే శక్తి స్కీమ్‌ను, జీఓనెం 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యను బలోపేతం చేయాల్సిన పాలకులు అందుకు భిన్నంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను ప్రభావితం చేసే నిర్ణయాలపై ప్రభుత్వం విద్యార్థులు అధ్యాపకులతో చర్చించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఆమరణ దీక్షలకు సైతం సిద్ధమని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్ నాయకులు సలిగంటి జయదీప్, ముదిగొండ నిరీక్షణ ప్రియాంషి సాయి కృష్ణ నీలాద్రి బండి హని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లపల్లిలో ఆరోగ్య సంక్షోభం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్నారులు మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడుతున్న నేపథ్యంలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని టీఆర్ఎస్ రక్షణ సేన డిమాండ్ చేసింది. ఈ మేరకు సంస్థ నాయకుడు ముసలి రామకృష్ణ ఒక ప్రకటనలో ప్రభుత్వ వైద్య శాఖ తక్షణమే స్పందించాలని కోరారు. ఆళ్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, కనీసం ఇద్దరు వైద్యులు, స్టాఫ్ నర్సులను నిరంతరం అందుబాటులో ఉంచి చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే ప్రజలను కలుపుకొని ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సింగారం గ్రామంలో వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోతికోయ గ్రామం సింగారంలో వైద్యాధికారి డాక్టర్ బి గోపీలాల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర బాధితులకు రక్తపూతలు, ఆర్‌డీటీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆర్‌డీటీ పరీక్షలో మలేరియా పాజిటివ్‌గా తేలిన ఓ బాధితుడిని 108 వాహనంలో ఆళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించారు. ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు కూడా రక్తపరీక్షలు చేశారు. పెద్ద వెంకటాపురం పంచాయితీ సర్పంచ్ వజ్జ ఉమా సహకారంతో గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఫాగింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యంపై డాక్టర్ గోపీలాల్ అవగాహన కల్పిస్తూ, పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న వైద్య, రక్త పరీక్షల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఈఓ దొడ్డ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ మంకిడి నరేష్, ఏఎన్ఎం వజ్జ సుగుణ, అంగన్‌వాడీ టీచర్ కృష్ణకుమారి, ఆశా కార్యకర్త బడిశా లక్ష్మీ , తదితరులు పాల్గొన్నారు.

# పెనగడపలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా॥ తుకారం రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా॥ ప్రతాప్‌తో కలిసి శనివారం చుంచుపల్లి మండలం పెనగడప వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ల్యాబోరేటరీ, ఫార్మసీ, వార్డు, ఐఎల్ఆర్ లను పరిశీలించారు. వైద్య కేంద్రంలోని వివిధ రికార్డులు, హాజరు రిజిస్టర్, సెలవు వివరాలు, వివిధ లేఖలు తదితర పత్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పెనగడప గ్రామంలో నిర్వహిస్తున్న తొలి విడత దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటింటిని సందర్శించి ఇంటిలోపల బయట పిచికారీ చేయాలని, అంతేకాకుండా సీజనల్ వ్యాదుల నివారణకు గ్రామాల్లో పారిశుధ్యం, దోమల నియంత్రణ చర్యలు నిరంతరం చేపట్టాలని సూచించారు. . గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్ప్రేయింగ్ చేయించుకోవాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ తుకారం రాథోడ్‌తోపాటు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రతాప్, పీహెచ్‌సీ డా॥ బి.హరీష్, డిపిఎంఓ/ఎఓ టి.మోహన్, హెచ్‌ఈఓ బి.రాంప్రసాద్, బి.రవి, ఎస్‌యుఓ పి.శ్రీనివాస్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వర్గ విబేధాలకు తావు ఇవ్వొద్దు

**చదువుపైనే దృష్టిని సారించాలి : ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/గుండాల :** గిరిజన సంక్షేమ శాఖఎ ఇఎంఆర్ఎస్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు వర్గవిబేదాలుమనసులో పెట్టుకోకుండా చదువు పైనే దృష్టిని సారించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఇటీవల జరిగిన ఆందోళన నేపథ్యంలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో విడి విడిగా సమావేశమై పాఠశాలలో జరిగిన సంఘటనలపై వివరాలను సేకరించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు సొంత గ్రామాలను, తల్లి తండ్రులను వదిలి చదువు కోవడానికి వచ్చారని ,గురువులనే తల్లి తండ్రులుగా బావించి చదివి వృద్ధిలోకి రావాలని అన్నారు. దేవాలయం లాంటి విద్యాలయాలలో పోలీసులు ప్రవేశించకూడదని , వారు ప్రవేశించారు అంటే కొంత తేడా ఉన్నట్లేనని , ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడాలని ఏవిదమైన సంఘటనలు జరిగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ అద్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇద్దరికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/వైరాః** లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా గ్రేట్ విజన్, అవని క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఇద్దరికి ఆర్థిక సహాయం అందించారు. వైరా బ్రాహ్మణపల్లికి చెందిన చిన్మయిరెడ్డికి విద్యా అవసరాల నిమిత్తం రూ.10వేలు సహాయం, గండగలపాడు గ్రామానికి చెందిన పూర్ణకంటి లక్ష్మణుడికి వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఖమ్మం డిసిసి హెల్త్ సెల్ చైర్మన్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడతూ ప్రతిఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని, అవసరంలో ఉన్నవారికి తమ వంతు సహాయం అందించడం ద్వారా సమాజానికి మేలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు వుంద్రు శ్యామ్‌బాబు, నూకల వాసు, వుంద్రు వరలక్ష్మి , పిఎస్‌టిలు కొల్లా రాంబాబు, ఉయ్యూరు రామకృష్ణ, గద్దె నీరజతో పాటు కొదుమూరి రవి, సుగ్గల మాధవి, జాలా పుల్లారావు, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# విప్లవోద్యమ స్ఫూర్తి ప్రధాత సురవరం

**-వర్ధంతి సందర్భంగా ఘన నివాళి**




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న మేధావి, ప్రజా ఉద్యమ నిర్మాత సురవరం సుధాకర్‌రెడ్డి విప్లవోద్యమ స్ఫూర్తి ప్రధాత అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా తెలిపారు. విద్యార్థి దశ నుంచి సిపిఐ జాతీయ కార్యదర్శి వరకు సురవరం సుధాకర్‌రెడ్డి అనేక విప్లవోద్యమాలకు నాయకత్వం వహించారని ఆయన తెలిపారు. సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి వర్ధంతిసందర్భంగా శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జానిమియా మాట్లాడుతూ పార్లమెంటు సభ్యునిగా పనిచేసిన సురవరం జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం మొదలైనవి రావడానికి విశేష కృషి చేశారన్నారు. మేధావిగా ప్రతి సమస్యకు పరిష్కారం చూపగలిగిన వ్యక్తిగా సురవరం పేరొందారని జానిమియా తెలిపారు. భారతదేశం సంక్లిష్ట స్థితిలో ఉన్న పరిస్థితుల్లో సురవరం స్ఫూర్తిగా ప్రజా ఉద్యమాలకు పునరంకితం కావడమే ఆయనకు ఇచ్చే నివాళి అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు,పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, రావి శివ రామకృష్ణ, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబ శివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు వరదా నర్సింహా రావు, చింతల రమేష్, పగిడిపల్లి ఏసు, కార్యాలయ కార్యదర్శి కె. శ్రీనివాస్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సతీష్, జానపద కళాకారుడు పమ్మి రవి పాల్గొన్నారు.

# బాలబాలికలకు భద్రమైన బాల్యాన్ని అందించాలి

**-విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించాలి**
**-గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలి**
**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రతి చిన్నారికి సురక్షితమైన, భద్రమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు తెలిపారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు అనుకూలమైన న్యాయసేవల పథకం 2024 క్రింద బాలల సంరక్షణ అధికారుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ తల్లి కోడి తన రెక్కల క్రింద పిల్లలను పెట్టుకుని ప్రమాదాల నుండి ఎలా అప్యాయంగా కాపాడుకుంటుందో సమాజంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అదే రీతిలో ప్రేమతో, బాధ్యతతో సంరక్షించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు చిన్ననాటి నుంచే చట్టాలపై, ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి సరైన రీతిలో అర్థమయ్యేలా విడమరిచి చెప్పాలన్నారు. అనవసరపు స్పర్శను గుర్తించిన వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలిపేలా వారిలో ధైర్యాన్ని నింపాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో ఏమైనా అసాధారణ మార్పులు కనిపిస్తే టీచర్లు వెంటనే గమనించాలన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మార్గదర్శకులుగా నిలవాలన్నారు. బాలల సంరక్షణ అధికారులు తమ విధులను కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించి సమర్థవంతంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పిల్లలపై జరుగుతున్న వేధింపులపై తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలన్నారు. బాల్యం నుంచే పిల్లలకు మంచి నడవడిక, బుద్దులు, నైతిక విలువలు నేర్పడం చాలా అవసరమన్నారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సమాజం చాలా వేగంగా మారుతుందని దీని వల్ల బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు కూడా కొత్త రూపును సంతరించుకుంటున్నాయన్నారు. ప్రతి బిడ్డకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా జువైనల్ జస్టిస్ యాక్ట్ ఫోక్సో చట్టం వంటి విధానాలను బాధ్యతాయుతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు డా॥ పిపి కృష్ణార్జున్, డా॥ జివి మహేష్ నాథ్, వి. శ్రీనయ్య, ఎం. శ్రీనివాస్, ఎం. కల్పన, వి. శివరంజని, టి. మురళిమోహన్, పి. దేవి మానస, షేక్ మీరా ఖాసీంసాహెబ్, కె. జ్యోతిర్మయి, బి. రజని, వై. బిందుప్రియ, ఎ. ప్రవీణ్, బి. నాగలక్ష్మి, జి. అఖిలగౌడ్, వి. దీప్తి, జి. నిష్క, బి. నాగసుమబాల, వి. లావణ్య, జిల్లా బాల సంరక్షణ అధికారిణి విష్ణువందన, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతులు సంతోషంగా లేరు..

**-రుణమాఫీ వంద శాతం ఎక్కడ జరగలేదు**
**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు సంతోషంగా లేరని రాష్ట్రంలో రుణమాఫీ వంద శాతం ఎక్కడ జరగలేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని మంచుకొండ గ్రామంలో బిఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో రుణమాఫీ వంద శాతం ఎక్కడ జరగలేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజక వర్గంలో వంద శాతం రుణమాఫీ జరిగితే సమాధానం చెప్పాలన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో రైతు సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుబంధు సగం ఎగొట్టారని, రైతు బీమా ప్రీమియం కట్టలేదన్నారు. గతంలో మట్టి గుట్టలు తరుగుతున్నాయంటూ ప్రచారం చేశారని ఇప్పుడు కాంగ్రెస్ నాయకులే మట్టి గుట్టలను కరిగించేస్తున్నారని, కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. తనపై అసత్య ప్రచారాలు చేసిన నాయకులు ఇప్పుడు ఖమ్మం నియోజకవర్గంలో జరుగుతున్న అరాచకాలకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు కోటి ఎకరాల భూమిని 22ఎ నిషేధిత జాబితాలో చేర్చారని వ్యవసాయ భూములే కాకుండా విలువైన ఇతర భూములు కూడా ఈ జాబితాలో ఉన్నాయన్నారు. 22ఏ మీద అవగాహన లేక తప్పు జరిగిందని క్షమాపణ చెప్పి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తప్పించుకోలేరన్నారు. నిషేధిత జాబితా నుండి తొలగించడానికి కమిషన్లు తీసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతుందన్నారు. రఘునాథపాలెం మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించి రఘునాథపాలెంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని రాబోయేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. తాను ఖమ్మం నుంచే పోటీ చేస్తానని అజయ్‌కుమార్ తెలిపారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే ప్రమాదం ఉందని ముగ్గురు మంత్రులు ఉండి కనీసం సమీక్ష కూడా చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో పగడాల నాగరాజు, మందడపు నర్సింహారావు, మందడపు మాధవరావు, వీరునాయక్, గుత్తా రవి, పిన్ని కోటేశ్వరరావు, మెంటెం రామారావు, మాధంశెట్టి హరిప్రసాద్, సర్పంచ్‌లు తేజావత్ శంకర్, పెంట్యా నాయక్, రామ్మూర్తి, రాము నాయక్, సైదులు, కాంపాటి రవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు డిజిటల్ టివిలు వితరణ




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** డిస్ట్రిక్ ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగర పరిధిలోని గోపాలపురం సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలకు డిజిటల్ టివిలను వితరణ చేశారు. జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, సిడిపివో వీరభద్రమ్మ ల విజ్ఞప్తి మేరకు టివిలను సమకూర్చారు. శనివారం గణేష్ బోనాల నిలయం, ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 10 డిజిటల్ టివిలను అందజేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ కేంద్ర సభ్యులు హరినాథ్ దొడ్డపనేని, వ్యవస్థాపక కార్యదర్శి బయ్యన బాబురావు లు మాట్లాడుతూ విదేశాలలో స్థిరపడినప్పటికీ జన్మభూమిపై మమకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని సత్ఫలితాలు సాధిస్తే మరిన్ని సహాయ కార్యక్రమాలు చేపడతామన్నారు. సిడిపివో వీరభద్రమ్మ మాట్లాడుతూ దాతల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మరింత నాణ్యమైన విద్యా బోధన అందిస్తామని తెలిపారు. సహకారం అందించిన ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ అధ్యక్షులు బోనాల రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, కొంగర పురుషోత్తం, దొడ్డపునేని కృష్ణారావు, ఖాదర్‌బాబు, ఉపాధ్యాయులు ఉమా, నాగమణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఎర్ర మందారం సురవరం సుధాకర్‌రెడ్డి




**ప్రజాపక్షం/వైరా:** సురవరం సుధాకర్‌రెడ్డి నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడని, జీవితాంతం అట్టడుగు వర్గాల అభ్యున్నతి, పేద ప్రజల సంక్షేమం, ఎర్రజెండా బలోపేతం కోసం కృషి చేశారని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం వైరాలోని సిపిఐ కార్యాలయంలో గారపాటి అశోక్ అధ్యక్షతన స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి ఒక ఎర్ర మందారం అని కొనియాడారు. దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా పనిచేయాలని తొలినాళ్ల నుంచే ఆకాంక్షించిన నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండా రామకృష్ణ, మూట కొండ, గారపాటి అశోక్, రాయపూడి శ్రీను, ఓర్సు భాస్కరరావు, ఉపతాల సాంబ, ఓర్సు వెంకన్న, వేము రాంబాబు, ఇన పలూరి ముత్తయ్య, కారుమంచి వేణు, ఆదూరి సుధాకర్, అప్పం సుధాకర్, రవి తదితరులు పాల్గొని సురవరం సుధాకర్‌రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు.

# జీవో 97ను వెంటనే రద్దు చేయాలి



**ప్రజాపక్షం/దమ్మపేట:** పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసేలా తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో మందలపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ పోవాలి..కేసీఆర్ రావాలి అంటూ నినాదాలు చేయడంతో ఎక్స్‌రోడ్డు దద్దరిల్లింది. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు, అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఏ, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు వెంపటి భరత్‌కుమార్, నియోజకవర్గ యువజన విభాగ మాజీ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, మండల యువజన విభాగ మాజీ అధ్యక్షుడు మండవ సత్య, మండల నాయకులు దారా యుగంధర్, రావుల శ్రీనివాసరావు, అల్ల జంగం, గాజుబోయిన యేసుబాబు, తుమ్మల లక్ష్మణరావు, సర్పంచ్ సోయ్యం సత్యవతి, ఉప సర్పంచ్ ముత్తిన రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను, మాజీ కోఆప్షన్ ఎంపీటీసీ బుడే అబ్దుల్ జిన్నా తదితరులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూ(ఐజే యూ) ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రం లో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీడీఓ షేక్ షిలార్ సాహెబ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, సీనియర్ జర్నలిస్టులకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని జర్నలిస్టు నాయకులు పేర్కొన్నారు. మండలంలో ప్రత్యేక జర్నలిస్టు కాలనీ ఏర్పాటు చేయాలని, అర్హులైన ప్రతీ జర్నలిస్టులకు 200గజాల ఇంటి స్థలాలను ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పప్పుల శ్రీనివాసరావు, ఉబ్బని సుందర్, మేకల రాజు, కూరపాటి విజయ్, గోవింద సురేశ్, బోడపట్ల సతీశ్, గుజ్జు రామకృష్ణ, గొర్రెపాటి శ్రీశైలం, గాదరి బాబు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఆటల పోటీలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈనెల 25న మండల పరిధిలోని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు. 05 నుండి 18 సం. గల వారికి స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. 514 ఏళ్ల వారికి జిగ్‌జాగ్ రన్నింగ్ మ్యూజికల్ చైర్, కప్పగంతులు, బాతు నడక, లెమన్ అండ్ స్పూన్ 50 మీటర్ల పరుగు పందె ఉంటాయని 1518 సం. గల వారికి 100 మీటర్ల పరుగు పందెం, నిదాన నడక, కుర్చీల ఆట, షాట్‌పుట్ త్రో డిస్కస్ త్రో లాంగ్ జంప్ హై జంప్ క్యారమ్స్ నిర్వహిస్తామని అన్నారు. ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు కూడా ఉంటాయని చెప్పారు. మండలంలోని దివ్యాంగులు ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.